
ఒరియా మూలం: అనంత్‌ప్రసాద్ పండా

# ఫస్ట్ తరువాత్!!

—వి. లక్ష్మి



హరిబాబు యింట్లోకి రాగానే, ఆఖరివాడు టునూ—"నాన్నా! బిస్కెట్ తెచ్చావా?" అంటూ అడిగాడు. హరిబాబు కొడుకుని ముద్దాడుతూ—"ఫస్టు తర్వాత" అని జవాబిచ్చారు.

టునూ ఖుషీగా, అక్కదగ్గరకి పరిగెత్తుకుంటూ వెళ్ళాడు. వాడి అక్క కునూ స్కూల్లో చదువుతోంది. అక్క దగ్గరగా తచ్చాడుతూ—"అక్కా! ఫస్టుతారీఖు యెప్పుడు?" కునూ గోడమీద వున్న కేలండర్ చూసి, "ఇవాళ యింకా ఏడో తారీఖు. ఫస్టు రావడానికి ఇంకా ఇరవై ఏడు రోజులు వుందిరా. ఏం ఎందుకు?" అడిగిన ప్రశ్నకి జవాబు యియ్యకుండా, టునూ తన చేతివేళ్ళు లెక్కపెట్టుకోసాగాడు. ఒకటి....రెండు....మూడు యెన్నిసార్లు లెక్కపెట్టినా ఇరవై ఏడు సరిగ్గా లెక్కపెట్టలేక పోయాడు. సరే ఫస్టు యెప్పటికయినా రాక పోతుందా? అప్పుడు చూద్దాం. నాన్న బిస్కెట్ పాకెట్ తెస్తే తను యెవరిక యియ్యడు.

తండ్రి కాళ్ళు కడుక్కోడానికి పెరడువేపు రావడం చూసి, ఇదే మంచి సమయం అని, కునూ తండ్రి దగ్గరగా వచ్చి, గునుస్తూ—"నాన్నా! జోళ్ళు చిరిగిపోయాయి. స్కూల్‌కి వెళ్ళేసరికి కాళ్ళు మట్టికొట్టుకుపోతున్నాయి. రోజూ టీచర్ కేకలెయ్యడమే. కొంటారా నాన్నా?"అంది. కూనూని దగ్గరకి తీసుకుంటూ, నెమ్మదిగా బుగ్గలు నిమిరి—"ఫస్టు తర్వాత తప్పకుండా కొంటానమ్మా. నా తల్లి వికదూ. వెళ్ళి ఆడుకో" అని నెమ్మదిగా సముదాయించి పంపించేశారు హరిబాబు.

ఇంకో రెండడుగులు వేసేసరికి, పెద్ద కూతురు హేమ—"చాలా రోజుల నుంచీ అడుగుతున్నాను నాన్నా! ఈ పండక్కి అయినా, నాకు నల్లంచు తెల్లచీర కొనిపెట్టవూ?" బూట్ లేస్ విప్పుకుంటూ, "సరేనమ్మా! ఈ ఫస్టుకి కొంటాన్లే." అని శాంతంగా జవాబిచ్చారు హరిబాబు. ఆఫీస్ బట్టలు విప్పుకుని; వరండాలో వున్న వాలుకుర్చీలో కూర్చుందామని అటువేపు వెళ్తున్న హరిబాబుకి, పెద్ద కొడుకు నీలూ టెన్నిస్ రాకట్ తిప్పుకుంటూ ఇంట్లో అడుగుపెట్టడం కనిపించింది. వీడు ఒక్కడే మిగిలాడు....అని అనుకుని నవ్వుకున్నారు మనసులో హరిబాబు.

కానీ ఆయన అభిప్రాయాన్ని వమ్ముచేస్తూ, నీలూ తండ్రి దగ్గరగా వచ్చి, తీరికగా కూర్చోడం చూసి, "నాన్నా! కాన్వాస్ జోళ్ళు కొంటానన్నావు. లేకపోతే ఆడడం అవడం లేదు. కొంటావా ఈ నెల?" దానికి సమాధానంగా తల వూపి "ఫస్టు తర్వాత!" అన్నారు. నీలూ అడ్డు తగుతూ, "అదేంటి నాన్నా! ఇవాళ యింకా ఏడో తారీఖు. ఫస్టు రావడానికి యింకా చాలా రోజులు వుంది," అన్నాడు నిరాశగా.

చేతిలో కాఫీ కప్పుతో హరిబాబు భార్య వంట గదినుంచి బయటికి వస్తూ—"మీ నాన్న వచ్చారట్రా? మీ నాన్నతో చెప్పు, ఇంక నా వల్ల కాదని. రెండు నెలల నుంచి పోరు పెడుతూనే వున్నాను. మూకుడు పాడయి పోయింది. కొత్తది కొనాలని. కొనేలేదు. మళ్ళీ భోజనం దగ్గరకి వచ్చేసరికి, పుత్త అన్నంతో సరిపెడతారా మీరందరూ? మళ్ళీ అన్నీ కావాలి...."

"నీలూ! మీ అమ్మతో చెప్పు. ఈ నెలకి యెలాగో సర్దుకోమని. వచ్చే నెల కొంటాను" అంటూ కూర్చున్నచోటు నుంచే గట్టిగా కేకవేస్తూ. ఆవిడ కోపంతో రుసరుసలాడుతూ, "సరి! నిన్ననో, మొన్ననో ఫస్టు అయింది. నెల రోజుల్లో ఎన్ని ఫస్టులు వస్తాయేమిటి?" అన్నారు వెటకారంగా. సమాధానంగా కాఫీ తాగుతూ, తనకేమీ పట్టనట్టు హరిబాబు పేపరు చదువుకోసాగారు.

## 2

రోజంతా చాకిరీచేసి ఇంటికి వచ్చేసరికి, అందరిదీ ఒకటే కంప్లెయింట్—అది కావాలి, ఇది కావాలని. అందరికీ హరిబాబుగారిది ఒకటే జవాబు—"ఫస్టు తర్వాత!" దానికి తోడు తెల్లవారితే చాలు, బయట నుంచీ వచ్చేవి—కంప్లెయింట్సు!! ఇంటిగలాయన వారం రోజులకి ఒకసారి వచ్చి—ఆరు నెలల అద్దె బాకీ యియ్యండి. లేకపోతే ఖాళీ చెయ్యండి—అంటాడు. ప్రతిసారీ హరిబాబు పళ్ళు నములుతూ—"ఈ నెల యింట్లో చాలా ఖర్చులు వున్నాయి. వచ్చే నెల మీ డబ్బు యిస్తాను" అంటారు. పాలవాడు వచ్చి—"రెండు నెలలనుంచి పాల డబ్బులు మీరు యియ్యడం లేదు. ఈ నెల యిస్తే సరే, లేకపోతే పాలు పొయ్యడం మానేస్తాను" అని జడిపించేసి వెళ్ళాడు.

ఉద్యోగంలో ప్రవేశించినప్పటి దగ్గరనుంచి హరిబాబుగారి ఆర్థిక పరిస్థితులు ఏమీ మారలేదు. జీతం అప్పటికన్నా ఎక్కువయినప్పటికీ అదే అవస్థ. పెరుగుతున్న ధరలు, పెరుగుతున్న సంతతి—కారణాలు. ఇప్పుడు హరిబాబుగారు ఆఫీసర్ అయితే మాత్రం ఏముంది—వూరి నిండా అప్పులు, అరువులు. తన ఇరవైఅయిదేళ్ళ సర్వీసులో ప్రతి నెలా

శాంతిగా గడిపేది ఒక్క రోజే—అదే ఫస్టు తారీఖు!

ఆ రోజు మాత్రం హరిబాబుగారు చాలా ఖుషీగా వుంటారు. జేబులో నోట్లకట్టతో యింటికి వస్తారు. ఇంటికి వస్తూ, బజారునుంచి టునూకో బిస్కెట్ పాకెట్, కూను కోసం రంగు రంగుల రిబ్బను, హేమకోసం ఏదైనా చీర—ఇలా ఇంటిల్లిపాదికీ తలో ఓ వస్తువు తెస్తారు. కిందటినెల భార్య ఏదయినా అడిగినట్టు జ్ఞాపకం వుంటే అదే కొంటారు. కానీ మర్నాడు తెల్లారి లేచి చూస్తే—జేబు ఖాళీ. ఇంకా వారం తిరగకుండానే జేబు ఖాళీ అయి కూర్చునేది. ఆ తర్వాతనుంచి, ఎవరయినా, ఎప్పుడయినా యేదయినా అడిగితే తనకి తెలియకుండానే—"ఫస్టు తర్వాత" అని జవాబిచ్చేవారు.

ఆ రోజు ఆఫీసునుంచి, యింటికి వచ్చేసరికి చాలా ఆలస్యం అయింది—పని చాలా ఎక్కువగా వుండి. అన్యమనస్కంగా, ఆలసటగా, యింటికి తిరిగి వచ్చారు హరిబాబు. రాగానే చిన్న కూతురు కూను—"నాన్నా! మరేమో, అమ్మకి పెద్ద జ్వరం వచ్చింది. మందు కొనరా?" అని అడిగింది. హరిబాబు అలవాటుగా—"అమ్మతో చెప్పు. ఫస్టు తర్వాత కొంటాను" అనేశారు.

కూను పసిపిల్ల. దాని పసి మనసుకి ఇవన్నీ అర్థం అవుతాయా? పరిగెత్తుకుంటూ వెళ్ళి అమ్మదగ్గర హాజరు. కూనుని చూస్తూ, కూను అమ్మగారు "ఏమ్మా! మీ నాన్నగారు వచ్చారా? మందు తెమ్మని చెప్పు" కూను వెంటనే—"అమ్మా! మందు సంగతి అడిగాను. ఫస్టు తర్వాత తెస్తారట" అనేసింది.

కూను అమ్మగారు జ్వరంతో వణికిపోతున్నారు. దానికి తోడు భర్త మాటలు విని శివమెత్తినట్టు ఏడుస్తూ—"అన్నీ, ఫస్టు తర్వాతేనా? అప్పటిదాకా నేను బతికివుంటే కదా!" మొగుణ్ని తిట్టిపోశారు.

అప్పటికిగానీ హరిబాబుకి, తాను తెలియక చేసిన పొరబాటు తెలిసిరాలేదు. ఆ తర్వాతనుంచి, డబ్బు విషయంలో ఆయన తీరుతెన్నూ మారిపోయింది. ఎంత తెస్తున్నారో, యెంత ఖర్చవుతుందో—[illegible]ంచుకోవడమే మానేశారు. ఫస్టు అవగానే జీతం అంతా భార్య చేతికి యిచ్చి, చేతులు దులుపుకునేవారు. ఎవరయినా వచ్చి, ఏమయినా అడిగితే—"వెళ్ళి మీ అమ్మని అడగండి"—అని జవాబు వచ్చేది ఆయన దగ్గరనుంచి. □

కీ. శే. బాలగంగాధర తిలక్ కథ - గత సంచికలో ప్రచురించబడిన తిలక్‌గారి కథ 'జీవితం' తొలిసారిగా 1941లో భారతిలో ప్రచురించబడింది. మేము పేర్కొన్నట్టు 1949 లో కాదు. గమనించవలసిందిగా మా పాఠకులను కోరుతున్నాము.

—ఎడిటర్



